

# హైదరాబాద్ వార్త



# కిడ్నాప్‌ల కలవరం

- నగరంలో కలకలం రేపుతున్న వరుస ఘటనలు
- కిడ్నాప్‌కు గురవుతున్న వారిలో చిన్నారులే అధికం
- పోలీసులకు సవాళ్లుగా మారుతున్న కేసులు

హైదరాబాద్, జూలై 6,ప్రభాతవార్త: నగరంలో ఇటీవల కిడ్నాప్ ముఠాలు రెచ్చిపోతున్నాయి. అనాథలతోపాటు, ఫుట్‌పత్‌మీద నిద్రపోతున్న చిన్నారులు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లలో ఉండే వారినే టార్గెట్ చేస్తూ ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. తాజాగా సింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కిడ్నాప్ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పింకీ దేవి, అజయ్ అనే దంపతులు పటాన్ చెర్వులోని ఇస్నాపూర్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈదంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. వారికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈనేపథ్యంలో ఈనెల 4న సొంతూరుకు వెళ్లే క్రమంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లోకి వెళ్లే ముందే పింకీ, అజయ్‌కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న ఆఇద్దరిని మరో మహిళ గమనించింది. నలుగురికి పిల్లలపై దృష్టి సారించిన ఆమహిళ ..అందరి కంటే చిన్నవాడైన ఏడునెలల బాలుడిని కిడ్నాప్ చేసింది. మద్యం మత్తు నుంచి తేరుకున్న తర్వాత ..పిల్లాడు కనిపించకుడా పోయాడని పేరెంట్స్ ఆందోళనకు గురై స్టేషన్ అంతటా వెతికారు. కానీ బాబు కనిపించడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పిల్లాడి ఆచూకి కోసం గాలిస్తున్నారు. అయితే బాలుడిని కిడ్నాప్ చేసిన మహిళ చెన్నైలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**మేడ్చల్‌లో కిరాణం దుకాణానికి వెళ్ళిన చిన్నారి..** అలాగే మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓచిన్నారి కిడ్నాప్ కలకలం రేపింది. చాక్లెట్ కోసమని కిరాణ దుకాణానికి వెళ్ళిన నాలుగేళ్ల చిన్నారి అపహరణకు గురైంది. స్థానికంగా ఉండే ఓవ్యక్తి పాపను కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..ఘట్‌కేసర్ ఈడబ్ల్యూఎస్ కాలనీలో భరత్, రాజేశ్వరి దంపతులు నివాసం ఉంటున్నారు. భరత్ వృత్తిరిత్యా పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి నాలుగేళ్ల కుమార్తె కృష్ణవేణి ఉంది. బుధవారం రాత్రి 8గంటల సమయంలో చాక్లెట్ కోసమని సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్ళింది. ఆతర్వాత చాలా సేపటికి పాప ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ,కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టపక్కల ప్రాంతాల్లో పాపకోసం వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో వెంటనే ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. సిసి కెమరాలు పరిశీలించగా పక్కనే ఉన్న ఓథియేటర్ లో పనిచేసే మతిస్థిమితం లేని సురేష్ అనే వ్యక్తి పాపను ఎత్తికెళ్ళినట్లు గుర్తించారు. గురువారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు సురేష్‌ను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా చిన్నారిని ఘట్‌కేసర్‌లో చేసినట్లు ఒప్పుకున్నాడు. రైల్వేపోలీసులు ఘట్ కేసర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితుడిని అరెస్ట్ చేసి చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించారు.

**హయత్‌నగర్ పరిధిలో..** గత మంగళవారం రాత్రి హైదారబాద్ శివారు ప్రాంతం హయత్‌నగర్‌లోనూ ఓమైనర్ బాలిక కిడ్నాప్‌కు గురైంది. ఇద్దరు తెలియని వ్యక్తులు బాలికను అడ్రస్ అడగుతున్నట్లు నటించి ఆమెను కిడ్నాప్ చేశారు. అనంతరం ఓఆర్ఆర్ ప్రాంతానికి తీసుకెళ్ళి బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. వారిబారి నుంచి తప్పించుకున్న బాలిక హైదరాబాద్ – విజయవాడ ప్రధాన రహదారిపైకి చేరుకుంది. ఆదేసమయంలో అటుగా వెళ్తున్న ఓహిజ్రా బాలిక ఏడుస్తుండటాన్ని గుర్తించి.. దగ్గరకు వెళ్ళి వివరాలు తెలుసుకుంది. ఆతర్వాత హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు బాలికను ఆసుపత్రికి తరలించారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏడు నెలల బాలుడు కిడ్నాప్

**కొనసాగుతున్న దర్యాప్తు**

కంటోన్మెంట్,జూలై 6 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 7 నెలల చిన్నారి కిడ్నాప్‌కు గురైన సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన పింకీ దేవి,అజయ్‌లు పొట్టకూటి కోసం నగరానికి వలస వచ్చి పటాన్ చెరువు ఇస్నాపూర్‌లో కూలిపని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వారికి నలుగురు పిల్లల్లు ఉన్నారు. దంపతులకు తరుచుగా మద్యం సేవించి అలవాటు ఉంది. ఈ నెల 4న స్వగ్రామానికి వెళ్లేందుకు వారి నలుగురి పిల్లలతో కలిసి మద్యం సేవించి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. వారి నలుగురి పిల్లలో 7 నెలల కుమారుడు కన్నయ్య కనిపించకుండా పోయాడు. ఆ చిన్నారి కోసం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికి ఫలితం లేకపోయింది. దీంతో దంపతులు గోపాలపురం పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసునమోదు చేసుకొని వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. కిడ్నాప్‌కు గురైన చిన్నారి కన్నయ్యను ఓ మహిళ అపహరించినట్లు, ఆ మహిళ చెన్నైలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## స్విమ్మింగ్ ఫూల్‌లో పడి ఐదేళ్ల బాలుడు దుర్మరణం

నార్సింగి, జూలై 6 ప్రభాతవార్త : స్నేహితులతో ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు అపార్టుమెంట్‌లోని మూడో అంతస్థులో ఉన్న స్విమ్మింగ్‌ఫూల్‌లో పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామానికి చెందిన రవి కుమారుడు దేవాన్ష్(5) బుధవారం స్నేహితులతో కలిసి అపార్టుమెంట్ లోని మూడో అంతస్థులో ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పక్కనే ఉన్న స్విమ్మింగ్‌ఫూల్‌లో పడిపోయాడు. స్నేహితులు గమనించి దేవాన్ష్ కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే వచ్చి దేవాన్ష్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న దేవాన్ష్‌ను పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భార్య అత్తమామల వేధింపులతో ఆత్మహత్య



మృతుడు వెంకట్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

కుషాయిగూడ, జూలై 6,ప్రభాతవార్త. భార్య అత్త మామ వేధింపులు తట్టుకోలేక మానసిక వేదనకు గురి అయ్యి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పోచమ్మ టెంపుల్ ప్రాంతంలో నివసించే ములుగు వెంకట్ రెడ్డి (38)కి శంషాబాద్ కు చెందిన మోహన్ రెడ్డి కుమార్తె కళ్యాణి అలియాస్ మౌనికకు 2015 జూన్ లో వివాహం జరిగింది. కాగా వెంకట్ రెడ్డి,మౌనిక లకు ఉపాసన,హన్సిక ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. దీంతో భార్య కళ్యాణి ఇంట్లో నుండి వెళ్లిపోయి రెండు నెలల తర్వాత ఈనెల రెండవ తేదీన తన తల్లిదండ్రులు సుజాత, మోహన్ రెడ్డి తోపాటు మృతుడు వెంకట్రెడ్డి తోడల్లుడు వెంకటరెడ్డి నివాసానికి వచ్చి నానా దుర్భాషలాడడంతో పాటు తల్లిని వదిలేసి బయటకు వచ్చి ప్రత్యేక కాపురం పెట్టాలని వేధింపులకు గురి చేయడంతో పాటు తల్లిని వదిలిపెట్టి రావాలంటూ ఒత్తిడి చేయడంతో తట్టుకోలేక మృతుడు వెంకటరెడ్డి భార్య అత్తమామల ముందే గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడినప్పటికీ భార్య అత్తమామలు వారించకపోగా ఆత్మహత్య డ్రామా ఆడుతున్నాడు అంటూ మరిన్ని మాటలు అని వదిలివేశారు. విషయం సేవించిన వెంకట్ రెడ్డి అస్వస్థతకు గురి అవ్వడంతో గమనించిన ఇరుగుపొరుగు వారు మృతుడు వెంకటరెడ్డిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 5న మృతి చెందాడు. తమ తమ్ముడు వెంకట్ రెడ్డి చావుకు కారణమైన భార్య మౌనిక అలియాస్ కళ్యాణి, అత్త సుజాత ,మామ వెంకట్రెడ్డి ,తోడల్లుడు రాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరి బత్తుల రజిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గోల్కొండ జగదాంబకు పట్టువస్త్రాలు సమర్పణ

చాంద్రాయ గుట్ట, జూలై 6 ప్రభాతవార్త : ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని గౌలిపురా కోటమైసమ్మ, మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ జగదాంబకు పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పి చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మని కైలాష్‌వీర్ గంగపుత్ర, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జానకీరామ్ పాల్గొన్నారు.

## నవ వధువు ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి,జూలై 6 ప్రభాతవార్త : భర్తతో పాటు అత్తింటి కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక ఓ నవ వదువు ఆత్మహత్యకు తాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కధనం ప్రకారం.. పాత మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చెర్ల,గొల్లపల్లికి చెందిన చంద్రశేఖర్ (27) వివాహం కవిత (22)తో ఏడు నెలలు క్రితం జరిగింది.కాటేదన్‌లోని నేతాజీనగర్‌లో నివాపం ఉంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి భర్త,అత్తింటికి చెందిన కుటుంబ సభ్యులు కలిసి కవితను అదనం కట్నం తేవాలని వేధిస్తున్నారు. అత్తింటి వేధింపులు భరించలేక కవిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉస్మానియాలో ట్రాన్స్‌జెండర్ల కోసం స్పెషల్ క్లినిక్




హైదరాబాద్, జూలై 6 ప్రభాతవార్త: ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య సేవలు అందించే దిశగా కీలక అడుగు పడింది. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను అందుబాటులోకి తెచ్చింది. సెన్సిటైజేషన్ శిక్షణ పొందిన వైద్య నిపుణుల సిబ్బంది ట్రాన్స్‌జెండర్లకు విస్తృతమైన వైద్య చికిత్సలను అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్లినిక్ వారానికి ఒకసారి మాత్రమే అందుబాటులో ఉంది. ఇది ప్రతి బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తుంది. ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్యకు అనుగుణంగా రానున్న రోజుల సంఖ్యను పెంచాలని యోచిస్తున్నారు. అయితే ఉస్మానియా ఆస్పత్రిలో తమ కోసం ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేయడంపై ట్రాన్స్‌జెండర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్లినిక్‌లో ఇద్దరు ఎండోక్రినాలజిస్టులు డాక్టర్ రాకేష్ సహాయ్, డాక్టర్ నీలవేణి లింగమార్పిడి చేసిన వారికి హార్మోన్ల చికిత్స, ఇతర అవసరమైన చికిత్సలను అందిస్తారు. గైనకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, సైకియాట్రీ, యూరాలజీ ఇతర విభాగాల వైద్య సేవలు అందిస్తారు. సమర్థులైన వైద్యుల బృందంతో పాటు ప్రభుత్వ సర్వీసులో చేరిన తెలంగాణ తొలి ట్రాన్స్‌జెండర్ డాక్టర్ ప్రాచీ రాథోడ్, డాక్టర్ రూత్ జాన్ పాల్‌లను కూడా సమన్వయకర్తలుగా నియమించారు. "ట్రాన్స్‌జెండర్లు ఆరోగ్య సంరక్షణ సేవలను పొందడం చాలా కష్టం. ఆలస్యమైనా..వారానికి ఒక రోజు (బుధవారం) ఎలాంటి తారతమ్యం లేకుండా ఉచితంగా వైద్యం అందించే క్లినిక్ అందుబాటులోకి వచ్చింది" అని డాక్టర్ ప్రాచి తెలిపారు. వైద్య పరీక్షలు కూడా ఇక్కడ ప్రాథమిక దృష్టిగా ఉంటాయి.

# ప్రభుత్వ ఆస్తులకు విముక్తి

**లేబర్ అడ్డా ప్రహరీ గోడ కూల్చివేత**

**ఎమ్మెల్యే జోక్యంతో రంగంలోకి అధికారులు**

**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



లేబర్ అడ్డా వద్ద కార్పొరేటర్లు

అల్వాల్, జూలై 6 ప్రభాతవార్త: కూలీ నాలీ చేసుకునే పేద బలహీన వర్గాలకు కడుపు నింపే 5 రూపాయలు భోజనం, దశాబ్దాలు కాలంగా విజ్ఞాన బాండాగారంగా విరాజిల్లుతున్న ప్రభుత్వ గ్రంథాలయం, బాల సదనం, లేబర్ అడ్డా దారులను దాతలు మూసి వేశారు. సంవత్సరాలు కాలంగా పట్టణ ప్రజలకు సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆస్తులు చక్ర బంధంలోకి వెళ్ళాయి. దారులు మూసుకుని పోవడంతో పేదలకు 5 రూపాయలు భోజనం దూరమైంది. గ్రంథాలయానికి పాఠకుల రాక పోకలు తగ్గిపోయాయి. శ్రమ జీవులు రోడ్డున పడ్డారు. ఓల్డ్అల్వాల్‌లో దశాబ్దాలు కాలం క్రితం పౌర అవసరాలు కోసం దాతలు కొంత స్థలాన్ని దానం చేశారు. సంబంధిత స్థలంలో ప్రభుత్వం గ్రంథాలయం, పశువులు ఆసుపత్రి, బాలికల బాల సదనం కొలువు తీరాయి. సుమారు ఎనిమిది వందలు గజాలు స్థలం ఖాళీ ఉంది. స్థలంలో వారాంతపు సంతతో పాటుగా నిత్యం రోజువారీ కూలీ పని కోసం వేయి కళ్ళతో శ్రమ జీవులు ఇక్కడ ఎదురు చూస్తుండడం జరిగేది. మూడు నెలలు క్రితం దానం ఇచ్చిన భూమిలోని ఖాళీ స్థలం చుట్టూ పట్టాదారులైన వారసులు ప్రహరీ గోడ ఏర్పాటు చేశారు. ప్రజావసరాలు కోసం ఉన్నతమైన ఆలోచనలుతో దానం చేసిన భూమిని స్వాధీనం చేసుకోవడం విమర్శలకు తావిచ్చింది. పట్టణంలో ఇది పెద్ద చర్చకు దారి తీసింది. లేబర్ అడ్డా సమస్యకు సంబంధించి అధికార యంత్రాంగంతో పాటుగా రాజకీయ పార్టీలు నోరు మెదపలేదు. భూమికి పట్టాదారులు ఉండటం ఒకసారి దానం చేసిన భూమిని మరలా స్వాధీనం చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమస్యపై దృష్టి సారించారు. దానం చేసిన భూమి ప్రజలకే చెందాలన్నారు. ఉన్నతాధికారులుతో సంప్రదింపులు జరిపారు. రెవెన్యూ, జిహెచ్‌ఎంసి యంత్రాంగంతో జరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో బుధవారం ప్రహరీని కూల్చడం జరిగింది. గురువారం నుంచి ఐదు రూపాయలు భోజనం పునరుద్ధరణ జరిగింది. గ్రంథాలయానికి రాక పోకలు పెరగగా రోజువారీ కూలీలు హడావిడి మరోసారి కనిపించింది. సర్కిల్‌కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు గురువారం అడ్డాని సందర్శించారు. లేబర్ అడ్డా వద్ద మరోసారి పూర్వపు పరిస్థితి రావడంతో పట్టణ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు ఎల్లవేళలా రుణ పడి ఉంటామని తెలిపారు.

## ప్రారంభం కానున్న గుల్జారాహౌస్ కొత్త ఫౌంటెన్



చార్మినార్,జూలై 6 ప్రభాతవార్త : చార్మినార్ సమీపంలో నాలుగు రహదారుల మధ్యలో నూతనంగా నిర్మించిన సుందరమైన గుల్జారాహౌస్ ఫౌంటెన్ కొద్ది రోజులలో ప్రారంభం కానున్నది. గుల్జారాహౌస్‌లోని పురాతన ఫౌంటెన్‌ను తొలగించి అదే స్థానంలో నూతనంగా మోర్‌కున్ డిజైన్‌లో నూతనంగా ప్రభుత్వం ఫౌంటెన్‌ను నిర్మించింది. నాలుగు నెలలు క్రితం ప్రారంభమైన ఫౌంటెన్ పనులు దాదాపు పూర్తి అయ్యాయి.నూతనంగా నిర్మించిన గుల్జారాహౌస్ ఫౌంటెన్ కొద్ది రోజులలో ప్రారంభం కానున్నదని అధికారులు వెల్లడించారు. కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గుల్జారాహౌస్ షౌంటెన్ పనులు జరుగుతున్నాయి. చార్మినార్,మచిలీ కమాన్,కాలీకమాన్,మేవాఫల్ కమాన్‌ల మధ్య గుల్జారాహౌస్ రహదారి మధ్యలో ఎంతో సుందరమైన ఫౌంటెన్‌ను ఏర్పాటు చేశారు.పాత ఫౌంటెన్ ఒకటిన్నర అడుగు ఎత్తు ఉండగా,ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఫౌంటెన్ ఐదు అడుగుల ఎత్తు ఉంది.ఫౌంటెన్ చుట్టూ ఉన్న ఇనుప గ్రిల్స్‌పై వాటర్ ప్రూఫ్ ఎనిమిది విద్యుత్ దీపాలు,అదే విధంగా ఫౌంటెన్ భాగంలో ఎనిమిది వాటర్ ప్రూఫ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఫౌంటెన్ నుంచి వచ్చే వాటర్,విద్యుత్ దీపాల కాంతులలో నూతనంగా ఏర్పాటు చేసిన గుల్జారాహౌస్ ఫౌంటెన్ చార్మినార్‌ను తిలకించటానికి వచ్చే సందర్శకులను ఎంతోగానో ఆకట్టుకోనున్నది.

## బెల్లంపల్లి ఎక్స్‌రోడ్డులో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీసీ జాగృతి నాయకులు

హైదరాబాద్, జులై 6 ప్రభాతవార్త: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎక్స్ రోడ్డులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతి తెలంగాణ బీసీ జాగృతి ఆద్వర్యంలో గురువారం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిదంగా రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ మోర్చ అద్యక్షులు డా.లక్ష్మణ్‌ను కలిసి జాతీయ నాయకులు వినతిపత్రాలను వేర్వేరుగా అందజేశారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని జాగృతి నాయకులు పేర్కొన్నారు. విగ్రహం ఏర్పాటు విషయంలో జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమీషనర్లు, కేంద్ర అధికారులతో మాట్లాడుతామని తమకు హామినిచ్చినట్లు పేర్కొన్నారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో బీసీ జాగృతి అధ్యక్షురాలు కె.పి మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కత్తుల సుదర్శన్, ఉపాధ్యక్షులు అచ్చిని రమేష్, మాజీ కార్పొరేటర్లు వనం రమేష్ నేత, బీసీ నాయకులు ఆనంద్ గౌడ్, కార్యదర్శి పాతకోటి మహేష్, కిషోర్, మల్లికార్జున్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండకు జూనియర్ కాలేజ్ మంజూరు చేయాలి



మణికొండ మున్సిపాలిటీకి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నార్సింగి, జూలై 6 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీకి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ బిఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబిత ఇంద్రారెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మణికొండలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో కలిపి ప్రతీ ఏటా వెయ్యి మందికి పైగా విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధిస్తున్నారని, వీరంతా ఇంటర్ చదువుకునేందుకు రాజేంద్రనగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దూరభారం, రాకపోకలు సాగించేందుకు కష్టమవుతున్నందున చాలా మంది తల్లిదండ్రులు తమ ఆడబిడ్డలను చదువులు మాన్పించి వేస్తున్నారన్నారు. మణికొండలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తే అందరికి చాలా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కూడా వినతిపత్రంను అందజేసినట్లు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బిఆర్‌ఎస్ అద్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్లు వసంత్‌రావ్ చౌహాన్, నవీన్ కుమార్, నాయకులు జయరాజ్, శ్రవన్ కుమార్, శ్రీకాంత్, గంగాధర్ శాస్త్రి, సత్యనారాయణ, నరేందర్ ఉన్నారు.

## సాయిచంద్ భార్యను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



సాయిచంద్ భార్యను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కవిత

సరూర్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త: అకాల మృతి చెందిన తెలంగాణ ఉద్యమ ప్రజా గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ స్వర్గీయ సాయిచంద్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇటీవల గుండెనొప్పితో హఠాన్మరణం చెందిన సాయిచంద్ కుటుంబం నివాసం ఉంటున్న హైదరాబాద్ నగర శివార్లలోని గుర్రంగూడ బాలాజీ కాలనీకి గురువారం ఎమ్మెల్సీ కవిత వచ్చారు. ఈ సందర్భంగా ఆమె సాయిచంద్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిం చారు. అయితే తనను చూసి భోరున విలపించిన సాయిచంద్ భార్యను దగ్గర తీసుకొని కవిత ఓదార్చారు. ఉద్యమ సమయం నుండి సాయిచంద్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆమె గుర్తు చేసుకొన్న కవిత కూడా భావోద్వేగానికి గురై కంట తడిపెట్టారు. అనంతరం ఆమె తేరుకొని మాట్లాడుతూ సాయి చంద్ లేని లోటు బిఆర్‌ఎస్ పార్టీకి ఎన్నటికీ పూడ్చలేనిదని అన్నారు. ఉద్యమ కాలంలో శ్రీకాంతచారి అమరుడైన వేళ సాయిచంద్ పాడిన పాట యావత్ తెలంగాణ ప్రపంచాన్ని కదిలించిందని ఆమె గుర్తు చేశారు. అయితే హఠాత్తుగా మరణించిన సాయిచంద్ కుటుంబం అధైర్య పడాల్సిన అవసరం లేదని తమతో పాటు యావత్ బిఆర్‌ఎస్ కుటుంబం అండగా ఆయన కుటుంబానికి ఉంటుందని కవిత స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి కూడా సాయిచంద్ నివాసానికి వచ్చి ఆయన భార్య, పిల్లలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## సమస్యలు లేని నియోజకవర్గంగా చేయడమే నాధ్యేయం: ఎమ్మెల్యే కాలేరు



మంచినీటి పైప్‌లైన్‌కు శంకుస్థాపన చేస్తున్న వెంకటేష్, అమృత

హైదరాబాద్, జులై 6 ప్రభాతవార్త: సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. ఈ మేరకు గురువారం నల్లకుంట డివిజన్‌లోని కళావతి వీధిలో 13 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు కార్పోరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు మౌలిక సదు పాయాలు కల్పించేందుకు విశేషంగా కృషి జరుగుతున్న దన్నారు. ఇందులో భాగంగానే గతంలో ఎన్నడు లేని విధంగా నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌లు, వరదనీటిలైన్‌లు వేయడం జరిగిందని, విద్యుత్ సమస్యలను పరిష్కారించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుండి లాల్‌దర్వాజ బోనాలు

**ఉత్సవాలను ప్రారంభించనున్న నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్,**



రంగురంగుల విద్యుత్‌ద్దీపాలతో ముస్తాబైన అమ్మవారి ఆలయం, ఆలయంలో కొలువుదీరిన సింహవాహిణి మహాంకాళి అమ్మవారు

చాంద్రాయ గుట్ట, జూలై 6 ప్రభాతవార్త : ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలు పాతనగరంలో అన్ని దేవాలయాల్లో శుక్రవారం కలశస్థాపనతో ప్రారంభకానున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ బోనాల ఉత్సవాలు 17వ తేదితో ముగుస్తాయి. ఉదయం పాతబస్తీలోని అన్ని దేవాలయాల్లో అమ్మవార్లకు అభిషేకం, పూజా కార్యక్రమాలు, కలశస్థాపన, శిఖర పూజతో ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

**9వ తేదిన సామూహిక ఘటాల ఊరేగింపు..** బోనాల ఉత్సవాల్లో భాగంగా 9వ తేది ఆదివారం ఘట స్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమం కనుల పండువగా నిర్వహించడానికి ఊరేగింపు కమిటీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు జరిగే రోజునే సాయంత్రం పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమంలో శాలిబండాలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమై లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖులు విచ్చేసి ఘటాలకు స్వాగతం పలుకుతారు. అనంతర ఆలయాల్లో ప్రతిష్టించి తొమ్మిది రోజుపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**లాల్‌దర్వాజలో 115వ వార్షిక బోనాల ఉత్సవాలు..** పాతనగరంలో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్దలతో జరుపుకునే లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి మహంకాళి ఆలయం 115వ వార్షిక ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

## 8న వరంగల్‌లో ప్రధాని మోదీ సభ విజయవంతం చేయాలి

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు**



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆపార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, చిత్రంలో డాక్టర్ కె.లక్ష్మణ్, మర్రి శశిధర్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి

హైదరాబాద్, జూలై 6 ప్రభాతవార్త : ఈనెల 8వ తేదీన వరంగల్‌లో జరిగే ప్రధాని మోదీ సభను ప్రజలు విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బర్కత్‌పురలోని సిటీ బిజెపి కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగసభపై పార్టీ నేతలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డిని ఆపార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ సభకు ప్రజలను సమీకరించడంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా పనిచేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.రాబోయే ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు పాతరేసి బిజెపిని గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఈ రెండు పార్టీల డిఎన్ఏ ఒక్కటన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బిఆర్‌ఎస్‌కు వేసినట్లేనని, బిఆర్‌ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లన్నారు. గతంలో అధికారం పంచుకున్న కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు బిజెపిని విమర్శించే హక్కు లేదన్నారు.

## కరీంనగర్‌లో 22, 23 తేదీలలో అంగన్‌వాడీల ద్వితీయ మహాసభలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మా

సైఫాబాద్, జులై 6 ప్రభాతవార్త: ఎఐటియుసి రాష్ట్ర అనుబంధ సంస్థయిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈ నెల 22, 23 తేదీలలో కరీంనగర్‌లో జరుగుతాయని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా తెలిపారు. ఈ మేరకు గురువారం సత్యనాయణరెడ్డి భవన్‌లో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనేక పోరాటాలు చేసి విజయాలను సాధించిన చరిత్ర తమ అసోసియేషన్‌కు ఆయన ఉందన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలో వేతనాలు పెంపు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కోసం, మీని అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలను ఎఐటియుసి నిర్వహించడం జరిగిందని ఆయన వివరించారు. రానున్న రోజులలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మిలిటెంట్ పోరాటాలను నిర్వహిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, గ్రాడ్యుటీ, పెన్షన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఇన్సూరెన్స్, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మేకల సాయి ఈశ్వరి అధ్యక్షత వహించగా నాయకులు నరాటి ప్రసాద్, సి.హెచ్.సీతామహాలక్ష్మి, టేకుమళ్ళ సమ్మయ్య, సుమతమ్మ, పారిజాన్, శాంతకుమారి, చందన తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్ సమాజానికి చేసిన సేవలు మరువలేము

**బిఆర్ఎస్ నాయకుడు కొమ్ముల నరేందర్**


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి
పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న కొమ్ముల నరేందర్

సైఫాబాద్, జులై 6 ప్రభాతవార్త:మాజీ ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం గురువారం బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహం ఎదుట ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. డా.బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్, బిఆర్ఎస్ నాయకుడు కొమ్ముల నరేందర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దళితులు, పేదలు, బడుగు బలహీనవర్గాల ప్రజల సంక్షేమ కోసం, సమాజానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతాలకోసం పాటుపడ్డారని, మూడు దశాబ్దాలపాటు కేంద్రంలోని ఆనేక శాఖలకు మంత్రిగా పనిచేసి, పదవులకే వన్నె తీసుకువచ్చారని కొనియాడారు. దళిత జాతి అభ్యున్నతి కోసం పదవులను సైతం లెక్కచేయకుండా ఆయన పనిచేశారని, డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే జగ్జీవన్‌రామ్ అమలు కోసం ఎంతో పాటుపడ్డారని ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్మిక నాయకుడు గోల్లపల్లి దయానందరావు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు వంగపల్లి శ్రీనివాస్, గాయకుడు, బాబూ జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటి ఉపాధ్యక్షుడు సంగీతం రాజలింగం, అఖిల మాదిగ వికాస్ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడప నాగయ్య, రూప, అజయ్, భాస్కర్, స్వాతి, ఆరేళ్ళ రాజేందర్, పల్లల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్ప మహానుభావుడు

**హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్**

హైదరాబాద్, జులై 6 ప్రభాతవార్త: దేశం కోసమే తన ప్రాణాలను బలిదానం చేసిన గొప్ప మహానుభావుడు జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్‌ముఖర్జీ అని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ కొనియాడారు. గురువారం హిమాయత్‌నగర్‌లో ముఖర్జీ 121వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే దేశంలో ఒక్కరే ప్రధానిగా ఉండాలని, ఇద్దరు చెల్లనేరదని ముఖర్జీ ఎంతో పోరాటం చేశారని, దేశం కోసం చివరికి కాశ్మీర్‌లో బలిదానం చేశారని గుర్తు చేశారు. ముఖర్జీ పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు ఎదురైనప్పటికీ కశ్మీర్‌లో ప్రధాని నరేంద్రమోదీ 370 ఆర్టికల్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. బిజెపి ఆధ్వర్యంలో మోదీ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్యకర్తలు ఇంటింటికి తీసుకువెళ్ళవలసిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. అంతకు ముందు ఆమె ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్‌గౌడ్, నగర నాయకులు మహేష్, జైస్వాల్, జాకి, సాయి ప్రవీణ్, జగదీష్, హితేష్, వేణుగౌడ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా అవసరాల మేరకు నిధుల మంజూరు

**జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్**



సంజయ్ నగర్‌లో శివరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్

యూసుఫ్‌గూడ, జూలై 6, ప్రభాతవార్త : ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికపుడు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం జరుగుతుందని బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అద్యక్షులు జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ అన్నారు. గురువారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిదిలోని సంజయ్‌నగర్ బస్తీలో రూ.30లక్షల,50వేల రూపాయలతో శివరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిదిలోని ప్రతి డివిజన్ బస్తీల కాలనీలలో కోట్లాది రూపాయలతో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, నజీర్, అరుణ్, బషీర్, సమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

**టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్ యాదవ్**

చిక్కడపల్లి, జూలై 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం రామ్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన జోహర్ హుస్సేన్‌ను సత్కరించే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగివేసారిపోయారని, అన్నిరంగాల్లో కెసిఆర్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ముఖ్యంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎంటూ ఏమి జరగలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే తప్ప కొత్తగా చేసిందేమి లేదన్నారు. ఈ సందర్భంగా తనకు పదవి రావడానికి కృషి చేసిన టిపిసిసి అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనీల్‌కుమారయాదవ్, మాజీ ఎంపి మల్లు రవి, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ అమ్జద్ హుస్సేన్, లాయక్ ఆలీ, ఇఫామ్ హుస్సేన్, ఉజేర్ హుస్సేన్, రెహ్మత్ పాషా, ఖాయూం హుస్సేన్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య ఇనాక్ రచనలో ప్రతి అక్షరం సముద్రంలో ఒక పర్వతమే

**తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్**


పోలి' కథానికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అయాచితం శ్రీధర్, దేవీప్రసాద్‌రావు

చిక్కడపల్లి, జూలై 6 ప్రభాతవార్త: ఆచార్య కొలకలూరి ఇనాక్ రచనలో ప్రతి అక్షర సముద్రంలో ఒక పర్వతమే ఉంటుందని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ 85వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఇనాక్ రచించిన 'పోలి' కథానికను డాక్టర్ అయాచితం శ్రీధర్ ఆవిష్కరించి ప్రసంగించే కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన గానసభలో జరిగింది. ఇనాక్ రచనలు లోతుగా వెళ్తేనే తెలుస్తుందని, ఆయన రచనల్లో ప్రతి వ్యాఖ్యాన్ని జాగ్రత్తగా రాయడం ఆయనకే సాధ్యమన్నారు. ముఖ్యంగా ఆయన రచనలు, సాహిత్యంపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆచార్య ఇనాక్ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం కాదు తపస్సు చేయాలని, అప్పుడే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఛైర్మన్ దేవీప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో అన్ని రుచులను నేర్పరి ఆచార్య ఇనాక్ అని అన్నారు. పీడికవర్గాల గురించి గొప్ప రచనలు చేశారని అన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్ గోనా నాయక్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, పిల్లలమర్రి రాములు, సంగీత గురువు శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, జులై 6 ప్రభాతవార్త : విద్యుత్ తీగలకు అడ్డుగా తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ లైన్ల మరమ్మత్తులలో భాగంగా దొమ్మర పోచంపల్లి, గాగిల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి గాగిల్లాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంల నుండి మధ్యాహ్నం 1గంల వరకు, 11కెవి సుందర ఆశ్రమం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 4గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు దుండిగల్, నాగలూర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## సుఖసంతోషాలతో ఉండాలని బోడ్రాయి పండుగ

**డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి**


లాలాపేట్‌లో బోడ్రాయి పండుగకు ఆహ్వానం పత్రికను అందిస్తున్న లాలాపేట్ నాయకులు

తార్నాక, జూలై 6 ప్రభాతవార్త: గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని బోడ్రాయి పండుగ జరుపుకుంటారని లాలాపేట్‌లో జరగనున్న బోడ్రాయి పండుగకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. లాలాపేట్‌లో రాజకీయ పార్టీలకు అతీతంగా జరగనున్న బోడ్రాయి పండుగ నిర్వాహకులు గురువారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వేడుకకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వంజరి ముత్తయ్య, మల్లేష్ యాదవ్, గేణుగోపాల్ రెడ్డి, సుక్కగణేష్ ముదిరాజ్, బాలియాదవ్, అశోక్ యాదవ్, కిరణ్‌గౌడ్ వారిని కలిసిన వారిలో ఉన్నారు.

## మల్టీపర్పస్ హాల్ నిర్మించాలి


జోనల్ కమీషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్

తార్నాక, జూలై 6 ప్రభాతవార్త: ఉప్పల్ స్కైవాక్ ప్రారంబోత్సవ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామి మేరకు నాచారంలో మల్టీపర్పస్ హాల్ నిర్మించాలని జోనల్ కమీషనర్ పంకజకు స్థానిక కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు వెంటనే స్పందించిన జెడ్‌సీ మల్టిపర్పస్ హాల్ నిర్మాణానికి సంభందించి ఎస్టిమేషన్లను సిద్దం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శాయిజన్ శేఖర్ పాల్గొన్నారు.

## ప్రజాభ్యుదయ కార్యక్రమాలను నిర్వహించే వారు ధన్యులు

**పీఠం ఉత్తరాధికారి, పరమహంస పరివ్రాజకాచార్య దత్త విజయానంద తీర్థస్వామి**

చిక్కడపల్లి జూలై 6 ప్రభాతవార్త: ప్రజాభ్యుదయ కార్యక్రమాలను నిర్వహించే వారు ధన్యులని దత్త పీఠం ఉత్తరాధికారి, పరమ హంస పరివ్రాజకాచార్య దత్త విజయానంద తీర్థస్వామివారు అనుగ్రహ భాషణం చేశారు. గురువారం అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన సాంస్కృతిక, సాహిత్య సేవా సంస్థ వంశీ సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు స్వామివారిని కలిసి వంశీ స్వర్ణోత్సవ జ్ఞాపికను అందించి గౌరవించారు. అర్ధశతాబ్దంగా వంశీ చేస్తున్న సేవలను అభినందిస్తూ కొన్ని దశాబ్దాల నుంచి అవధూత పీఠాధిపతి జగద్గురు పరమపూజ్య గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని, వంశీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవని కీర్తించారు.

## అలుపెరగని యోధుడు గ్జీవన్‌రామ్

**కార్పొరేటర్ పావనీ వినయకుమార్**


నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, జూలై 6 ప్రభాతవార్త: ఒకవైపు దేశ స్వాంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు అంటరాని వారికి సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు మాజీ ఉపప్రధానమంత్రి స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యనరకమంలో బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్,నేతలు ఎం.ఉమేష్; జి.శ్రీకాంత్, ఎన్.సత్తిరెడ్డి, కె.బాల్‌రాజ్ తదితరులతో పాటు బస్తీ సభ్యులు పాల్గొన్నారు.

**జగ్జీవన్‌రామ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి**

కంటోన్మెంట్,జూలై 6 ప్రభాతవార్త: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ బడుగు బలహీనవర్గాలకు చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆశయాలన ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని, సామాజిక సమనత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ అని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

## వైభవంగా భవ్య కావడి శోభా యాత్ర


పూజ కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యనగర్ కావడి సేవా సంఘం ప్రతినిధులు

చార్మినార్, జూలై 6 ప్రభాతవార్త : భాగ్యనగర్ కావడి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆగష్టు నెల 20వ తేదీన అత్యంత వైభవంగా భవ్య కావడి యాత్రను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు మంగేరామ్ తాహెల్ తెలిపారు.శ్రావణ మాసం సందర్భంగా భవ్య కావడి యాత్రను ఘనంగా జరుపుతున్నామని ఆయన తెలియజేశారు.26వ భవ్య కావడి యాత్ర సందర్భంగా గురువారం సంఘం ప్రతినిధులు గగన్ పహాడ్‌లోని స్పటిక్ శ్రీ శివ మందిరంలో పూజ,అర్చన చేశారు.మందిరం ట్రస్టీ కపిల్ అగర్వాల్ భాగ్యనగర్ కావడి సేవా సంఘం అధ్యక్షులు మాంగేరామ్ తాహెల్‌ను శాలువ కప్పి సన్మానించారు.ఆగష్టు నెల 20వ తేదీ ఆదివారం ఉదయం ఆరున్నర గంటలకు చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం నుంచి కావడి యాత్ర ప్రారంభమై ఘాన్సీ బజార్,బహదూర్‌పుర ప్రాంతాలు మీదుగా సిలబ్రేషన్ కన్వేషన్‌కు చేరుకుంటుందని ఆయన తెలిపారు.అదే రోజు రాత్రి సిలబ్రేషన్ కన్వేషనలో శివ బండార్,శివ మహాజాగరణ కార్యక్రమం జరుగుతుందని,భజన గాయకులు బిజయ్ జాజు,సన్నీ భట్టల భజన కార్యక్రమం జరుగుతుందని మాంగేరామ్ తాహెల్ వెల్లడించారు.ఆగష్టు నెల 21వ తేదీన గగన్‌పహాడ్‌లోని స్పటిక్ శ్రీ శివ మందిరంలో హరిద్వార నుంచి తీసుకు వచ్చిన గంగా జలంతో బ్రహ్మ ముహూర్తంలో అభిషేకం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. భవ్య కావడి యాత్రంలో పాల్గొనదలచిన వారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కావడి సంఘం ప్రతినిధులు మాంగేరామ్ తాహెల్,సురేంద్ర అగర్వాల్,సునీల్ కుమార్ అగర్వాల్,కమల్ కిశోర్ మాలాణి,పంకజ్ వర్మ,చంపాలాల్‌బైద్,రుబీ మిశ్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కబ్జాల నుండి పార్కును కాపాడుకోవటం అభినందనీయం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**


పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పోరేటర్ గౌసుద్దీన్

ధర్నాచౌక్, జులై 6, ప్రభాతవార్త: శ్రీకృష్ణ కాలనీ పార్కును కబ్జాల నుండి కాపాడుకోవటం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. గురువారం భోలక్పూర్‌లోని శ్రీకృష్ణకాలనీ పార్కు అభివృద్ధి పనులను ఆయన స్థానిక కార్పోరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కాలనీ వాసులందరూ ఒక అసోసియేషన్‌గా ఏర్పడి, ఐక్యంగా పోరాడినందువల్లనే పార్కు దక్కిందని అన్నారు. ముషీరాబాద్‌లో ఉన్న పార్కులను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఈ పార్కులో కూడా పదిహేను లక్షల రూపాయలతో పలు సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, మంచినీటి సౌకర్యం, కూర్చునేందుకు బెంచీలు, చుట్టూ కాంపౌండ్ వాల్ తదితర వసతులు స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా, జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ సుభాష్, డీఈ సన్నీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసు, అసోసియేషన్ అధ్యక్షులు యాదగిరి, ఉపాధ్యక్షులు మహ్మద్ లైక్, బాలకృష్ణ, మహ్మద్‌అలీ, సీపీఎం నేత అజీజ్ పాషా, బీఆర్ఎస్ నాయకులు బింగి నవీన్, ప్రశాంత్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**


బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

ధర్నాచౌక్, జూలై 6, ప్రభాతవార్త : అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కొనియాడారు. గురువారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ వ్యవసాయ మంత్రిగా, రక్షణశాఖ మంత్రిగా కేంద్రంలో ఎన్నో పదవులను ఆయన చేపట్టినప్పటికీ, ఆ పదవులు ఆయనకు అలంకారం కాకుండా ఆ పదవులకే ఆయన అలంకారం నిలిచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మనమంతా ఆ మహనీయుని స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అన్నపూర్ణ, బాలకృష్ణ, ఎస్.ప్రకాష్, రవిగౌడ్, సత్యనారాయణ, యాదగిరి పాల్గొన్నారు.

## మాయమాటలతో యువతిని తీసుకెళ్లినవారిపై చర్యలు తీసుకోవాలి



సోని జాదవ్ తల్లితో కలిసి మాట్లాడుతున్న మౌనిక సుంకర

హైదరాబాద్, జూలై 6,ప్రభాతవార్త: మాయ మాటలు చెప్పి యువతిని తమ వెంట తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది దుర్గా వాహని ప్రతినిధి మౌనిక సుంకర అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లంగర్‌హౌజ్‌కు చెందిన సుమాన్ జాదవ్ కుమార్తె సోని జాదవ్, అమినా బేగం ఒకేపాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్నారని,సోని జాదవ్‌తో ఉన్న స్నేహాన్ని అడ్డుపెట్టుకుని గతనెల 7న సదరు యువతి ఇంట్లో ఎవరికి చెప్పకుండా తన వెంట తీసుకెళ్ళిందన్నారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో లంగర్ హౌజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తులో అమిన్‌బేగం ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో జూన్ 11న పోలీసులు సోనిజాదవ్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరుప రిచారన్నారు. మరికొద్దిరోజులకు సోనీ కనిపించకుండా పోయిందని అమిన్‌బేగంను నిలదీస్తే తనకు తెలియదని చెబుతుందన్నారు. ఆమెను విదేశాలకు అక్రమ రవాణా చేశారన్న అనుమానం కలుగుతుందని దీనిపై విచారణ జరిపించి బాధిత యువతి ఆచూకి కనుగొనాలని ఆమె కోరారు. ఈసమావేశంలో బాధితురాలి తల్లి సుమన్‌జాదవ్, ధర్మవీర్ అధ్యాత్మిక చైతన్య వేదిక అధ్యక్షులు కశ్యప మహర్షి ధర్మవీర్ పాల్గొన్నారు.

## హోటల్ భవనంపై నుంచి పడి యువకుడి దుర్మరణం

కంటోన్మెంట్, జూలై 6 ప్రభాతవార్త: పొట్టకూటి కోసం నగరానికి వలసవచ్చి అదే హోటల్ పై నుంచి ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల మెట్టుపల్లికి చెందిన సాయికుమార్ అనే యువకుడు సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం ఎదురుగా ఉన్న మెట్రో పోలీస్ హోటల్‌లో పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పడిగల రాజు 22, అతని స్నేహితుడు సాయికుమార్‌లు కలిసి ఈ నెల 5వ తేదీన రాత్రి నగరానికి వచ్చి అదే హోటల్‌లోని 8వ అంతస్థులోని టెర్రస్‌పై మద్యం సేవిస్తున్నారు. ప్రమాదవశాత్తూ రాజు కిందపడి మృతి చెందాడు. ఈ కేసును గోపాలపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిజాం కళాశాల పరిపాలన పదవుల్లో మార్పులు

సైఫాబాద్, జులై 6 ప్రభాతవార్త: బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో పలు పరిపాలన పదవుల్లో మార్పులు, చేర్పులు చేస్తూ పలు నియామకాలను గురువారం కళాశాల ప్రిన్సిపల్ బి.భీమా చేపట్టారు. నిజాం కళాశాల ఎగ్జామ్ కంట్రోలర్‌గా డా.బి.జ్యోతి, అకాడమిక్ కో-ఆర్డినేటర్‌గా డా.ఎస్.రేణుక, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సల్ కో-ఆర్డినేటర్‌గా డా.ఎస్.స్రవంతి, ఉమెన్స్ హాస్టల్ వార్డెన్‌గా ఎ.లక్ష్మి, ఎగ్జామ్ బ్రాంచ్ స్పెషల్ ఆఫీసర్‌గా డా.కె.లక్ష్మణ్, అల్యుమ్నై అసోసియేషన్ కో-ఆర్డినేటర్‌గా సోనాక్షి, పిఆర్ఓ డా.సి.సిహెచ్.పరంధాములు నియమితులైనారు. వీరికి ప్రిన్సిపల్ నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భీమా మాట్లాడుతూ కళాశాల బలోపేతంకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్-ప్రిన్సిపల్ డా.ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి తలసానికి కృతజ్ఞతలు తెలిపిన ముస్లిం మైనార్టీలు


మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానిస్తున్న బేగంపేట్ ముస్లిం మైనార్టీలు

కంటోన్మెంట్,జూలై 6 ప్రభాతవార్త: ముస్లిం మైనార్టీలకు గ్రేవ్ యార్డు స్థలాన్ని కేటాయించడం వల్ల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు రుణపడి ఉంటామని బేగంపేట్ ముస్లిం మైనార్టీలు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో ముస్లిం మైనార్టీల గ్రేవ్ యార్డు, 2 ఎకరాల స్థలాన్ని కేటాయించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ గురువారం మారేడ్‌పల్లిలోని మంత్రి తలసాని నివాసంలో వారు కలిసి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సలీమ్‌ఖాన్,అనీఫ్, అబ్బాస్, సబేర్, ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

హైదరాబాద్,జూలై 6,ప్రభాతవార్త: ఐదువేల కోట్ల ఫీజుల రియంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా ప్రైవేట్ విద్యావ్యవస్థను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదని బిసి విద్యార్థిసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అన్నారు. ఈమేరకు గురువారం విద్యానగర్ బిసిభవన్‌లో ఆయన మాట్లాడుతూ 1200మంది విద్యార్థులు ఆత్మబలిదానం చేసుకుంటే ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలోని విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం సకాలంలో ఫీజుల రియంబర్స్‌మెంట్‌ను చెల్లించక.. యాజమాన్యాలు సర్టిఫికేట్లు ,హాల్ టికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం వస్తుందని చెప్పిన కెసిఆర్ రాష్ట్రం ఏర్పడి 10ఏళ్ల గడుస్తున్నా ఊరికి ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువులకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు చెల్లించకపోవడంతో నాసిరకం భోజనం సేవిస్తూ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థి నాయకులు పృథ్వీగౌడ్, బలరాం, అన్నపూర్ణ, వినోద్, ప్రవీణ్, అర్జున్, వంశీ పాల్గొన్నారు.

## బండ్లగూడ కార్పోరేషన్‌ను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెడుతాం

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్
జెనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, జూలై 6 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెడుతామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మేయర్ మహేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్పోరేషన్ జెనరల్ బాడీ సమావేశంకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు రేయింబవళ్లూ కష్టపడుతున్నామన్నారు. మంచినీటి సమస్యను శాశ్వతంగా దూరం చేశామని, నిత్యం జల మండలి అధికారులతో కో ఆర్డినేషన్ చేస్తూ వేసవి మొత్తం నీటి ఇబ్బందులు రాకుండా చూశామన్నారు. త్వరలోనే మరిన్ని ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ప్రారంభించడం జరుగుతుందని, అప్పుడు అధిక ప్రెషర్‌తో మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా కూడా సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు. కమ్యూనిటీ భవన్‌ల నిర్మాణంకు రూ.240లక్షలు, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి, పార్క్‌లకు రూ.4,606లక్షలు కేటాయించడం జరిగిందని, ఇందుకు కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మాణం చేశారని వివరించారు. ప్రజలు తమ సమస్యలను స్థానిక కార్పోరేటర్లకు తెలియజేయాలని, వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. పాలకవర్గ సభ్యుల సమిష్టి నిర్ణయాల వలన బండ్లగూడ కార్పోరేషన్ వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి, కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, కార్పోరేటర్లు చంద్రశేఖర్, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పద్మావతి పాపయ్య యాదవ్, నిఖిలా సంగారెడ్డి, అస్లాం, రాము, మాలతీ నాగరాజు, శ్రీలత సురేష్‌గౌడ్, స్రవంతీ నరేందర్, సాగర్‌గౌడ్, అనితా వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు మలాకి రత్నం, జగదీష్, ఖుర్షీద్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయాలు : ఎమ్మెల్యే



ప్రారంభోత్సవంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి, దయానంద్‌గుప్తా, నరసింహగుప్తా

**ఎల్.బి.నగర్, జూలై 6 ప్రభాతవార్త :** ప్రజా సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేందుకు వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధి లోని భవానినగర్ రోడ్‌నెంబర్ 11లో నూతన వార్డు కార్యాలయాన్ని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా హాజరై ప్రారంభించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదకొండు విభాగాల అధికారులు వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ప్రజాసమస్యలు సత్వారం పరిష్కారం అయ్యేందుకే వార్డు కార్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వార్డు కార్యాలయంలో ప్రతిఒక్క అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అప్పటికప్పుడు కాలనీలోని సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పట్టణప్రగతి కార్యక్రమం చేపట్టిందన్నారు. పచ్చదనం, పారిశుధ్యం, తాగు నీరు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని, పర్యావరణ పరి రక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పారిశుధ్యం పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పష్టంచేశారు. ప్రతిరోజూ రహదార్లు, డ్రైనేజీలను శుభ్రం చేయా ల్సి ఉంటుందని, పాఠశాలలు, కార్యాలయాలు తదితర సంస్థల్లో పరిశుభ్రత పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, ఖాళీస్థలాల వెంట మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారంకోసం ఒక రోజును ప్రత్యేకంగా కేటాయించాలని, తాగునీటి వనరు లు, వైకుంఠదామాలు, డంపింగ్ యార్డులకు సంబంధించి వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలి పారు. ప్లాస్టిక్‌కవర్లను పూర్తిగా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి తాగునీరు సమస్యలు తెలుసుకోవాలని అన్నారు. నల్లా నీటి సరఫరాతో నీటి సమస్య లేకుండా పోయిందని మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు అందిజేస్తున్న ఆసరా పింఛన్ పథకం అండగా మారిందన్నారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ హరికృష్ణయ్య, కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, బీజేపీ నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, కృష్ణప్రకాష్, నాయకులు బుగ్గారపు శరత్‌చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, బిచేనేపల్లి వెంకటేశ్వరరావు, రమణారెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామాలుగా కార్పొరేషన్లు: మంత్రి సబితారెడ్డి



అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి సబితారెడ్డి: పక్కన పారిజాత

**సరూర్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని కార్పొరే షన్లను అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గం లోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలోని 26, 3, 4, 5 డివిజన్లలో రూ.85 లక్షల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బిటిరోడ్లకు శంకుస్థాపన చేసి కమ్యూనిటీ హాల్, వీధిదీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలోని కార్పొరేషన్లను, మున్సిపాలిటీలను ఒక విజన్‌తో అభివృద్ధి చేస్తు న్నామని వెల్లడించారు. ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించడంతో పాటు అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణ, చెరువుల సుందరీకరణ చేసి సమీకృత మార్కెట్లు ఏర్పాటు చేయిస్తున్నామని వివరించారు. అదే విధం గా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని ప్రాంతాల్లో స్వచ్ఛతకు కూడా ప్రాధాన్య తనిస్తున్నామని అన్నారు. స్థానికంగా ఉన్న పది చెరువులను రూ.40 కోట్లతో సుందరీకరణ చేయిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి చర్యలు తీసుకొని అర్హులైన వారికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని సబితారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, స్థానిక కార్పొరేటర్లు రామిడి కవితా రాంరెడ్డి, రామిడి మాధురీ వీరకర్ణారెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డిలతో పాటు ముత్యాల లలితా కృష్ణ, పలువురు నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

**సాయిచంద్ సతీమణికి సబితమ్మ ఓదార్పు...** ప్రజా గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ సాయిచంద్ అకాల మృతితో విషాదం నుండి తేరుకోని ఆయన సతీమణిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె గుర్రంగూడ బాలాజీ కాలనీలోని సాయిచంద్ నివాసానికి వెళ్ళి ఆయన సతీమణిని, పిల్లలను ఓదార్చి ధైర్యం చెప్పారు.

# అనంత సరస్వతినగర్‌లో రూ. 96 లక్షలతో సిసి రోడ్డు పనులు : ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి, జూలై 6 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోని అనంత సరస్వతినగర్‌లో రూపాయలు 96 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఈస్ట్ ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోని బిజేఆర్‌నగర్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆయ న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీ కాంత్, డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, జిఎన్‌వి సతీష్‌కుమార్, పిట్ల శ్రీని వాస్, బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, ఉమాపతి, సంతోష్ రాందాస్, బ్రహ్మయ్య, మోహన్‌రెడ్డి, రఘుయాదవ్, కిషోర్, సిక్క ప్రభాకర్‌గౌడ్, యాద గిరి, ఇంద్రసేన రెడ్డి, సత్తయ్యగౌడ్, సత్యమూర్తి, ఉమాపతి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలాలి డివిజన్‌లో విస్తృత పర్యటన : నందికంటి



మహిళలకు కాంగ్రెస్ కరపత్రాన్ని అందజేస్తున్న నందికంటి శ్రీధర్

**నేరేడ్‌మెట్, జూలై 6 ప్రభాతవార్త:** కాలనీ నేస్తం....కాంగ్రెస్ హస్తం అనే నినా దంతో మౌలాలీ డివిజన్‌లో మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు నందికంటి శ్రీధర్ నాయకులు, కార్యకర్తలతో కలసి పాదయాత్ర నిర్వహించి స్థానికులచే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా పార్టీ రూపొందించిన కర పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబి స్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, వంశీ ముధిరాజ్, వినోద్ యాదవ్, శ్యామ్ దేవ సహాయం, కిరణ్, రైముద్దీన్, ఎల్లం, అలి, జానీ బాయ్, ఇసాక్, గుత్తి రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, కె.రాములు, సానాది శంకర్, మహేందర్ గౌడ్, విఠల్ ముదిరాజ్, కృష్ణ గౌడ్, పవన్, రెబ్బ వాసుల, ప్రవీన్, షేఖ్, భాగ్యరాణి, ఆశ, స్వప్న, మాధవి, నిర్మల, ప్రభ, అండమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం డివిజన్‌లో ఇంటింటికి బిజెపి కార్యక్రమం : సామ రంగారెడ్డి



కరపత్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తున్న సామ రంగారెడ్డి

**వనస్థలిపురం, జూలై 6 ప్రభాతవార్త :** ఇంటింటికి బిజెపి కార్యక్రమం వనస్థలి పురం డివిజన్‌లో సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో యశోధర కాలనీ, కృష్ణనగర్ కాలనీ, శక్తినగర్, ఓంకార్‌నగర్ కాలనీలలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల కు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వంలో మౌలిక వసతులు గణనీయంగా పెరిగాయ న్నారు. 9 సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం జాతీయ రహదారులను నిర్మిం చిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు, నిధులు ఇచ్చి తెలంగాణ అభివృద్ధికి తోడ్పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందో అని సంక్షేమ పథకాల పేర్లు మార్చి మోడీ విమర్శించే పనిలో పడ్డా రన్నారు వనస్థలిపురం డివిజన్‌లోని యశోధర కాలనీ ఎప్పుడో 20 సంవత్స రాల క్రితం నిర్మించిన డ్రైనేజి లైన్ జనావాసం పెరిగి చిన్నపాటి వర్షానికి పొంగిపొర్లుతున్నా పట్టించుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు లేరన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ నాతి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, తడకమల్ల విజయకుమార్, అంజన్‌కుమార్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వాసుచౌదరి, చెక్క అశోక్‌కుమార్, కృష్ణవేణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి : దేప



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దేప, ఉపేందర్‌రెడ్డి, గణేష్

**ఎల్.బి.నగర్, జూలై 6 ప్రభాతవార్త :** అణగారిన వర్గాల అబ్యున్నతి కోసం బాబుజగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివి జన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో కొత్తపేటలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో భారత మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిసందర్భంగా ఆయన విగ్రహానికి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమంకోసం అలుపెరుగని కృషి చేసిన సంఘ సంస్కర్త జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకుడు గట్ల రవీంద్ర, సామిడి గోపాల్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, నల్లెంకి ధనరాజ్‌గౌడ్, తలటి రమేష్, ఎన్ఎస్‌యుఐ శివ, రాజునాయక్, భాస్కర్‌నాయక్, ప్రేమ్‌నాయక్, కల్యాణ్‌యాదవ్, విజయ్, శ్రావణ్‌కురుమ, సలీం, శ్రీకాంత్‌రెడ్డి, విప్లవరెడ్డి, శివ, తాండ్ర భాస్కర్, ఖలీల్, సిద్దేశ్వర్‌చారి, రాంబాబు, కృష్ణా లక్ష్మణ్, ప్రభు, అనిల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏరాట్లు : నవజీవన్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త :** బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన జీహెచ్‌ఎంసీ ఏఈ నరేంద్రతేజతో కలిసి బంజారా కాలనీలోని కోట మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయం ఆవరణలో వర్షపు నీరు నిలుస్తోందని, దీంతో భక్తులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయని కాలనీవాసులు తెలిపారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ ఆలయ పరిసరాల లో వరదనీరు నిలువకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో రఘుపతినాయక్, బాలూనాయక్, బలరామ్ నాయక్ పాల్గొన్నారు.

# త్వరలో కార్తికేయనగర్ స్లాబ్ పనులు పూర్తి : కార్పోరేటర్ శాంతిశేఖర్

**నాచారం, జులై 6 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ కార్తికేయ నగర్ స్లాబ్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి రానుందని స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వంతెన పనులను కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ అధికారుల తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ తార్నాక నుంచి కార్తికేయనగర్‌కు వెళ్లే రద్దీగా ఉండే ఈ రోడ్డును రూ. 80లక్షల వ్య యంతో నిర్మిస్తున్న స్లాబ్ పనులు పూర్తి కావచ్చాయని, దీంతో వర్షపు నీటి సమస్యతోపాటు రాకపోకలకు సులువుగా ఉంటుందని కార్పొరేటర్ పేర్కొన్నా రు. త్వరితగతిన పనులు పూర్తి చేసినందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది, కాంట్రా క్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ లింగారావు, వర్క్ ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్, కార్తికేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రదాన్య కార్యదర్శి చంద్రశేఖర్, సతీష్‌బాబు, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్ చక్రవర్తి, పున్నారావు, ఆదినారాయణ, శ్రీనివాస్, మధు, శ్రీకాంత్, సుధాకర్, వేణు, నరోత్తంరెడ్డి, మధుప్రసాద్, బుచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

## కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



మల్లాపూర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ పన్నాల

**నాచారం, జులై 6 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానికులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు వారు హామినిచ్చారు. గోకుల్‌నగర్, చాణక్యపురి కాలనీ, దత్తాత్రేయనగర్, బాబానగర్, శక్తి శాయినగర్ తదితర కాలనీలల్లో వారు పాదయాత్ర నిర్వహించి స్థానికులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, కార్పొరేటర్ హామి నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పళ్ల కిరణ్‌కుమార్‌రెడ్డి, బోదాసు లక్ష్మి నారాయణ, రాపోలు సతీష్, తండా వాసుగౌడ్, శైలేష్ రెడ్డి, సత్తిరెడ్డి, రవీందర్, ఎస్వీ శ్రీనివాస్, సుర్గం శివ, శ్యామ్ సుందర్ రెడ్డి, నెమలి శ్రవణ్, నాగారం బాబు, చిన్న దుర్గయ్య, పేరు నాయక్, మహేందర్, బుసాని రఘు, వెంకట్ రెడ్డితథితరులు పాల్గొన్నారు.

**జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే, కార్పొరేటర్...** బాబుజగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మల్లాపూర్ డివిజన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# బాబూ జగ్జీవన్‌రాం సేవలు ఎనలేనివి



జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునరితారెడ్డి, అనితానాయక్



జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూలై 6 ప్రభాతవార్త:** దివంగత బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా మూసారాంబాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, నగర వ్యవసాయ కమిటీ ఛైర్‌పర్సన్ అనితానాయక్, డివిజన్ అధ్యక్షుడు చల్లారి రఘునందన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు తీగల అజిత్‌రెడ్డిలు మూసా రాంబాగ్‌లోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో...** దివంగత బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ఆధ్వర్యం లో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జితేందర్‌గుప్త, గౌర దేవేందర్, రమేష్‌రెడ్డి, జక్క మోహన్‌రెడ్డి, యాదగిరి సురేందర్, కొప్పుల దినేష్, లక్ష్మారెడ్డి, సందీప్, హరి, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముద్దగౌని లక్ష్మీప్రసన్న తదితరులు

**వనస్థలిపురం, జూలై 6 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధుడు భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా సాహెబ్‌నగర్ లో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్నరామ్మోహన్‌గౌడ్ పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో సాహెబ్‌నగర్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షు లు పారంద జగ్‌మోహన్, కొంగరి మహేష్, పారందస్వామి, సరస్వతి, బోడ శేఖర్‌ఆనంద్, గంగం రాజు, అశ్విన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9వ తేదీన ఉచిత ఆయుర్వేద శిబిరం

**వనస్థలిపురం, జూలై 6 ప్రభాతవార్త:** వనస్థలిపురండివిజన్ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీ ఫేజ్-1 లోని లక్ష్మి ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ నెల 9వ తేదీన ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యం.డి. డాక్టర్ యలగం దుల శ్రీనివాసులు తెలిపారు. ఈ ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటలవరకు నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరంలో అన్ని దీర్ఘకాలిక వ్యాధులతోపాటు కీళ్లనొప్పులు, పక్షవాతము, కిడ్నీ సమస్యలతోపాటు ఎముకల వ్యాధులకు ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ నవీన్‌కుమార్‌చే చికిత్సలు చేయబడతాయని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి

**హయత్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త:** దళిత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని దళిత బహుజన సం ఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రరవీందర్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారందస్వామి అన్నారు. జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతిని పురస్క రించుకుని హయత్‌నగర్‌లో నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... జగ్జీవన్‌రామ్ రాజకీయ దురంధరుడిగా, పరిపాలనా దక్షుడిగా పేరు పొందారన్నారు. 50 ఏళ్లపాటు ఏకదాటిగా పదవులను పొంది అనుగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, జంగం ముదిరాజ్, దాసరిమోను శ్రీధర్, సుక్కవెంకటేష్, క్యాదాసు సతీష్, బుట్టి శివ,పారంద కృష్ణ పాల్గొన్నారు.

**తుర్కయాంజాల్ మునిసిపాలిటీలోని ఇంజాపూర్‌లో...**

**తుర్కయాంజాల్, ప్రభాతవార్త:** ఘనంగా తుర్కయాంజాల్ మునిసిపాలిటీ ఇంజాపూర్‌లో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా బిజెపి పార్టీ ఇన్చార్జి బోసుపల్లి ప్రతాప్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బచ్చిగళ్ళ రమేష్ ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో బడుగు బలహీన వర్గాల అబ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు అనన్యం, అనితర సాధ్యమని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లెల ఉపేందర్, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కొండ్రు పురుషోత్తం, దేవరకొండ బాలయ్య, మల్లెల శివకుమార్, మల్లెల రామకృష్ణ, మల్లెల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి: అందెల



బిజెపి అధికారంలోకి రావాలని అందెలతో కలిసి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

**సరూర్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో పథకాలకు అర్హులైన ప్రతిఒక్కరూ ప్రధాని మోడిపాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవాలని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం ఆయన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొ రేషన్‌లోని బాలాపూర్ గ్రామంలో గడప గడపకు బిజెపి కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా గ్రామం, కాలనీల్లోని ఇంటింటికి పాదయాత్రగా వెళ్ళిన ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**బోనమెత్తిన బాలాపూర్...** కాగా అందెల గడప గడపకు బిజెపి పాదయాత్ర కార్యక్రమం బాలాపూర్‌లో సందడిగా సాగింది. ఈ సందర్భంగా పలువురు మహిళలు బోనాలతో అందెల బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంత రం శ్రీరాములుయాదవ్‌తో కలిసి మహిళలు స్థానిక నల్ల పోచమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, స్థానిక బాలాపూర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వెంకటేష్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, కొంతం ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంపత్‌రెడ్డి, గుండె నాగార్జున బాబు, జోరల ప్రభాకర్, సంజీవ, రావుల మల్లేష్ పన్నాల భార్గవ్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా నిలుస్తాం : మొగుళ్లపల్లి



వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న ఉపేందర్ గుప్తా

**ఎల్.బి.నగర్, జూలై 6 ప్రభాతవార్త :** నిరుపేదలకు అండగా నిలుస్తామని డాక్టర్ మొగులపల్లి ఉపేందర్ గుప్తా పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ మున్సిపల్ కాలనీకి చెందిన వికలాంగుడు మహేష్‌కు మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో సురిశెట్టి శ్రీనివాస్ గురువారం ట్రై సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు, అందులకు ఉచిత వివాహలు చేస్తున్నామని, ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు అందజేస్తున్నామన్నారు. తాము చేపడుతున్న ఉచిత వివాహాలు, పేద వారి చదువులకోసం అనేకమంది దాతలు ముందుకు వచ్చి సహాయ సహకా రాలు అందిస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చొప్పవరపు పవన్, శ్రవణ్, హరిబాబు పాల్గొన్నారు.

# సాంస్కృతిక భవనానికి శంకుస్థాపన : మంత్రి

**సరూర్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 34వ డివిజన్ లెనిన్‌నగర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సాంస్కృతిక భవన పనులకు రాష్ట్ర విద్యాశాఖమంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు. మేయర్ ముదావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు ఇంద్రావత్ రవినాయక్, వేముల నర్సింహ, సౌందర్య విజయలతోపాటు పల్లె జంగయ్యగౌడ్, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, జె.శ్రీనివాస్‌నాయక్, దిండు భూపేష్‌గౌడ్, గడియాల కృష్ణ, పెద్ద సంఖ్యలో బస్తీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

**మెడికల్ కాలేజీ మంజూరు చేసినందుకు సిఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం**

కాగా మహేశ్వరం నియోజకవర్గానికి కొత్తగా మెడికల్ కళాశాలను మంజూరు చేసినందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి సిఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

# బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు : షఫీ



షఫికి వినతి పత్రం సమర్పిస్తున్న శంకర్‌ముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, జూలై 6 ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఓల్డ్ మలక్‌పేట డివిజన్ ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీ పేర్కొన్నారు. మలక్‌పేట శ్రీ పోచమ్మ దేవాలయం ప్రతినిధులు పి.టి.శంకర్ ముదిరాజ్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డిలు గురువారం షఫీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన జరుగనున్న బోనాల పండుగను పురస్కరించుకుని ప్యాచ్‌వర్క్ పనుల ను పోచమ్మ దేవాలయంనుండి మటన్ మార్కెట్, పంచశీల గ్రంథాలయం, అగ్రికల్చర్ ఆఫీస్, వాటర్ ట్యాంక్, వాహెద్‌నగర్, జింకలగడ్డబావి వరకు చేపట్టాలని కోరారు. స్ట్రీట్ లైట్స్ మెయింటెనెన్స్, చెట్ల కొమ్మలు తొలగింపు, తదితర పనులను చేపట్టాల్సిందిగా పేర్కొన్నారు. వెంటనే షఫీ స్పందించి తగినచర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టిన్నుసింగ్, వార్డు కమిటీ సభ్యుడు శ్రీనివాస్, అన్వర్ పాష,షేక్ మహ్మద్ పాల్గొన్నారు.

## నాగోల్ కార్యాలయాన్ని సందర్శించిన బీహార్ అధికారులు

**ఎల్.బి.నగర్, జూలై 6 ప్రభాతవార్త :** బీహార్ రాష్ట్రానికి చెందిన రవాణా శాఖ అధికారులు నాగోలు ఆర్టిఏ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ప్రత్యేక శిక్షణ కోసం నగరానికి వచ్చిన బీహార్ రవాణా శాఖ అధికారులు నాగోల్ కార్యాలయం సందర్శించి డ్రైవింగ్ ట్రాక్, లైసెన్సు జారీ చేసే విధానాలను గురించి తెలుసుకున్నారు. స్థానిక ఆర్టిఏ కార్యాలయంలో విధుల నిర్వహణ గురించి వారు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం విధివిధానాల గురించి నాగోలు ఆర్టీవో సురేష్‌రెడ్డి బీహార్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వి.శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, పి.రఘుకుమార్, అనిత సిబ్బంది పాల్గొన్నారు.

# మీర్‌పేట్‌లో ఘనంగా జగ్జీవన్ రామ్ వర్ధంతి

**సరూర్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, కోడూరు సోమేశ్వర్ తదితరులు చౌరస్తాలోని బిజెఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో జెడి కుమార్, సూల ప్రభాకర్, పసునూరి బిక్షపతి చారి, భీంరాజ్, రమేష్ ముదిరాజ్, రఘు, కృష్ణ, పోలే రాజు, మల్లికార్జున్, వేణుగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి దాసు తదితరులు పాల్గొన్నారు.